# సంతృప్తి

-సన్నిత్ ఎల్త్యైవి



అదొక గవర్నమెంట్ ఆఫీసు. టైం ఉదయం పది గంటలైనప్పటికీ ఆఫీసంతా ఖాళీగా ఉంది. తర్వాత ఒక్కొక్కరూ నెమ్మదిగా, బద్ధకంగా వచ్చి తమ సీట్లలో సెటిలవుతున్నారు. ముందుగా హెడ్ క్లర్క్ 'శుభానంద్' అసెంబ్లీలోని ప్రతిపక్షనాయకుడి స్టైల్లో "ఫ్రెండ్స్! అమెరికా చేతులకి చిక్కిన సద్దాం హుస్సేన్‌ని ఆ ప్రభుత్వం ఉరి తీయాలా? లేక జీవితకాలపు కారాగారశిక్ష విధించాలా?" అని జనాంతికంగా అడిగాడు. అదేదో తన కుటుంబ సమస్య అయినట్లు ఒక్కొక్కరూ ఒక్కో రకంగా తమ అమూల్యమైన అభిప్రాయాలను చెప్పడం మొదలెట్టారు.

ఈలోగా లంచ్ టైం అయింది. పొద్దుటి నుండీ ఆఫీసు పనివలన అలసిపోయిన ఉద్యోగులు, ఫైళ్లను శ్రద్ధగా చూస్తున్నట్లు నటిస్తూ తమ సీట్లలోనే కునుకుతీయడం మొదలుపెట్టారు. ఈసారి డిస్కషన్ ప్రపంచ రాజకీయాల నుండి రాష్ట్ర రాజకీయాల్లోకి దిగింది. ఈలోగా సాయంత్రం అయింది. ఆఫీసు క్లోజ్ చేసే టైమయింది. ఇళ్లకు చేరాలన్న ఆత్రంతో హడావుడిగా వెళ్లిపోయారు. ఈ విధంగా మూడు డిస్కషన్లు, ఆరు సుఖనిద్రలుగా సాగిపోతున్న ఆ ఆఫీసుకి పెద్ద సమస్య వచ్చి పడింది. ఆ సమస్య పేరు శ్రీహర్ష, ఆ ఆఫీసుకి కొత్తగా రిక్రూట్ అయి వచ్చిన జనరల్ మేనేజర్.

★★★

శ్రీహర్ష వయసు పాతికేళ్లు. ఆరోగ్యంగా, బలంగా ఉంటాడు. విపరీతమైన పట్టుదల, ఆత్మవిశ్వాసం, దృఢమైన వ్యక్తిత్వం అతనికి పెట్టని ఆభరణాలు. క్రమశిక్షణ లేకుండా ఒక గమ్యం లేకుండా అస్తవ్యస్తంగా జీవితాన్ని గడిపేవారంటే అతడికి అసహ్యం. శ్రీహర్ష ఆఫీసులో అడుగుపెట్టిన మొదటి రోజే తన కింది ఉద్యోగుల మనస్తత్వాన్ని, వాళ్ల పని తీరుని అర్థం చేసుకున్నాడు. అయితే మార్పు అనేది ఒక గంటలోనో, ఒక రోజులోనో రాదని అతడికి తెలుసు. అందుకే ఓపిగ్గా అన్నీ సరిదిద్దాలనుకున్నాడు. అనుకున్నట్లుగానే అందరినీ మార్చగలిగాడు కానీ ఒక్కడిని తప్ప! ఆ ఒక్కడి పేరు 'మిశ్రా'. స్టోర్స్ సూపరింటెండెంట్ శివశంకర్ మిశ్రా!

శివశంకర్ మిశ్రా బెంగాలీ! చాలా కాలం క్రితమే హైదరాబాద్ వచ్చి సెటిలవ్వడం వలన తెలుగు బాగా వచ్చు. అతడి వయసు నలభై అయిదు. కానీ ఏభై ఏళ్లవాడిలా ఉంటాడు. దానిక్కారణం విపరీతమైన తాగుడు వల్ల మొద్దుబారిన అతని శరీరం. ప్రతీ రోజూ రెండు పెగ్గులు సేవించకపోతే అతడికి నిద్రపట్టదు. గుంభనంగా నవ్వుతూ అందరితో లౌక్యంగా వ్యవహరిస్తూ ఉంటాడు. కానీ ఆఫీసు పని మాత్రం కొంచెం కూడా చేయడు. అటువంటి ఒక సజ్జనుడికి తన జీవితాన్ని చిన్నాభిన్నం చేయడానికొచ్చిన రాక్షసుడిలా నిద్రలో వెంటాడే పీడకలలా తయారయ్యాడు అతడి బాస్ శ్రీహర్ష.

"సార్! మిమ్మల్ని బాస్ పిలుస్తున్నారు" అని ప్యూన్ వచ్చి చెప్పడంతో శ్రీహర్ష కేబిన్ వైపు వెళ్లాడు మిశ్రా. తలుపు తోసుకొని లోనికి వెళ్లేటప్పటికి సీరియస్‌గా ఏదో ఫైలు చదువుకుంటున్నాడు శ్రీహర్ష. మిశ్రా ఉనికిని గమనించి

"కమాన్ మిశ్రా! ప్లీజ్ టేక్ యువర్ సీట్" అని ఆహ్వానించాడు.

"చెప్పండి సార్. ఎందుకో పిలిచారంట" అమాయకంగా అడిగాడు మిశ్రా.

"పొద్దుటి నుండీ మీరు కష్టపడి పనిచేస్తుంటే చూసి ముచ్చటేసి కాస్త ఆప్యాయంగా మాట్లాడదామని పిలిచాను. సరే ఇంతకీ ప్రస్తుతం ఏం వర్క్ చేస్తున్నారు?" అని అడిగాడు.

మిశ్రాకి అర్థమయింది అతడెందుకు పిలిచాడో.

"సార్! అదీ...అదీ..." అంటూ నసిగాడు.

"చూడండి మన ఆఫీసులో ప్రతీ ఉద్యోగికీ ఒక్కొక్క పర్సనల్ కంప్యూటర్ ఇచ్చింది అందులో గేమ్స్ ఆడుకోడానికీ, సినిమాలు చూడటానికీ కాదు. కొంచెమైనా పనిచేయడానికి. మన ఆఫీసుకి కావాల్సిన ఎన్నో ఐటమ్స్‌ని కొన్నాం కదా. వాటికి సంబంధించిన వివరాలున్నాయా?" అనునయంగా అడిగాడు శ్రీహర్ష.

"సారీ సార్! అవన్నీ నేను కంప్యూటర్‌లో ఎంట్రీ చేయలేదు. ఎక్కడో చెదురుమదురుగా రాశాను"

"సరే! అయిందేదో అయింది. ఈ సాయంత్రంలోగా అవన్నీ టైప్ చేసి ప్రింటవుట్ తీసి నాకు ఇవ్వండి" అని మిశ్రాని పంపించేశాడు.

ఏ కళ నున్నాడో గానీ, బుద్ధిగా పనిచేయడం ప్రారంభించాడు మిశ్రా. ఆఫీసంతా ఆశ్చర్యానికి లోనయింది.

సాయంత్రం అయింది. ఆఫీసంతా ఖాళీ అయింది కానీ మిశ్రా మాత్రం ఇంకా పనిచేస్తూనే ఉన్నాడు. ఇంటికి వెళ్లబోతూ మిశ్రాని చూసి ఆగిపోయాడు శ్రీహర్ష.

అతడి దగ్గరికి వెళ్లి "మిశ్రా గారూ! కంప్యూటర్‌ని ఆఫ్ చేసి నాతో రండి" అని అడిగాడు.

"లేదు సార్! ఇంకా వర్క్ కాలేదు... మీరు వెళ్లండి" అంటూ నసిగాడు మిశ్రా.

"ఫర్వాలేదు.. రండి" అని తనతో పాటు తీసుకెళ్లాడు శ్రీహర్ష. దారిలో కనబడిన ఓ హోటల్ దగ్గర తన కారుని ఆపి మిశ్రాని ఆహ్వానించి 'టీ' ఆర్డరిచ్చాక అడిగాడు శ్రీహర్ష.

"మిశ్రాగారూ! ఇప్పుడు చెప్పండి... ఎలా ఫీలవుతున్నారు?"

"చాలా ఆనందంగా ఉంది సార్!" నవ్వుతూ చెప్పాడు మిశ్రా.

"దట్స్ గుడ్! అదే నేను మీకు చెప్పాలనుకున్నది. రోజూ పొద్దున్న ఆఫీసుకొచ్చి సొల్లు కబుర్లు చెప్పుకుంటూ సాయంత్రం దాకా టైమ్ పాస్ చేసి హమ్మయ్య! ఒక రోజు గడిచిపోయింది అనుకుంటూ ఇంటికి వెళ్లడానికీ, కాసింత సిన్సియర్‌గా పనిచేసి ఇంటికి వెళ్లడానికీ మధ్య ఉన్న 'తేడా'ని గమనించారు కదా! ఆ తేడా ఇంకేమిటో కాదు. 'పెదవుల మీద వెలకట్టలేని చిరునవ్వు, చిన్నపాటి సంతృప్తి. ఇంటిని స్వర్గసీమగా మలచుకోడానికీ దోహదమయ్యే ఉత్ప్రేరకాలు. అర్థమయింది కదా! టీ తాగండి" అంటూ ముగించాడు.

"థాంక్యూ సార్! నా దృక్పథాన్ని మార్చి నాకు ఎంతో మేలు చేశారు. ఇప్పుడు ఏదో తెలియని కొత్త శక్తి నాలో ప్రవేశించినట్లుగా ఉంది. నాలాంటి ఫ్రెండ్స్‌తో కలిసి ఖరీదైన ఫారెన్ విస్కీ తాగినప్పుడు గానీ, ఇంకెప్పుడూ ఇంత స్వచ్ఛమైన ఆనందం నాకు కలుగలేదు సార్. ఇప్పుడు నాకెంతో ఉత్సాహంగా ఉంది" నవ్వుతూ చెప్పాడు మిశ్రా.

'ఓకే! పదండి వెళ్దాం' అని లేచి ఒక మనిషి వ్యక్తిత్వాన్ని మార్చగలిగానన్న సంతృప్తితో తన కారు వైపు కదిలాడు శ్రీహర్ష.

★